క్లుప్తంగా

ఆకట్టుకున్న చిందు యక్షగానం



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో శనివారం నిర్వహించిన చిందు యక్షగాన నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. కళాకారులు కాంతామతి నాటికను ప్రదర్శించారు. పాత్రదారుల హావభావాలు, సన్నివేశాలు, యక్షగానం అలరించాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని తిలకించారు.

కొనసాగుతున్న విగ్రహాల ప్రతిష్ఠాపన

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలోని బీరన్న ఆలయంలో బీరన్న, కామరాతి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంగ నుంచి లింగాలను తీసుకొచ్చారు. కురుమ కులస్థుల జయజయ ధ్వానాల నడుమ సాయంత్రం గంగా బోనం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కురుమ కుల పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన చెట్ల తొలగింపు



పర్వతగిరి : రోడ్డుపై పడిన చెట్లను సిబ్బందితో కలిసి శనివారం తొలగించి వాహనదారుల ఇబ్బందులను ఎస్సై వెంకన్న దూరం చేశారు. మండలంలోని కంబాలకుంట తండా సమీపంలో రోడ్డుకు అడ్డుగా చెట్లు పడిపోగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అటుగా వెళ్లిన ఎస్సై వెంకన్న సిబ్బందితో కలిసి రోడ్డుపై పడిన చెట్లను ఎండ తీవ్రతలోనూ తొలగించారు. ఎస్సైకి వాహనదార్లు కృతజ్ఞతలు తెలిపారు.

విరాళం



సంగెం : మండలంలోని గవిచర్లలోని గుండ బ్రహ్మయ్య ఆలయానికి పునర్నిర్మాణం కోసం ప్రముఖ రచయిత వేలూరి రత్నమాల–రాములు (వీఆర్.విద్యార్థి) దంపతులు వారి కుమారులు అమరేంద్ర, శైలేంద్ర శనివారం రూ.2 లక్షల విరాళం ఆలయ కమిటీ చైర్మన్ కొంతం యాదగిరికి అందజేశారు. అలాగే రణదీర్ సోదరుడు రతన్ రూ 11,116 విరాళం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వక్కల శ్రీను, బయగోని ఎల్లాగౌడ్, ముప్పు దేవేందర్, కలింగం, బలరాం, వేలూరి రాజశేఖర్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



వర్ధన్నపేట : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, కేఎస్ఆర్ సంస్థ అధినేత నర్సింహారెడ్డి అత్త వీరమల్ల వీరమ్మ (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరద రాజేశ్వర్‌రావు దంపతులు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చిలుకమ్మనగర్‌లో..

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్‌కు చెందిన సమ్మక్క అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఏపీజే అబ్దుల్ కలాం పరపతి సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకాల కృష్ణమూర్తి నివాళులర్పించి రూ.6 వేల సాయం అందించి పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల బాధ్యులు కోగంటి ప్రభాకర్‌రావు, దొనికెల రాములు, కుమార్, రాధ పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం

కాశిబుగ్గ: ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిన యువకుడు మృతి చెందిన ఘటన ఎల్గూరు–నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య శనివారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం .. మహారాష్ట్ర జల్నా జిల్లా పార్టూరుకు చెందిన సచిన్ బీస్ (26) పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా రైలు నుంచి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని మృతుడి తండ్రి అశోక్ బీస్‌కు అప్పగించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

- విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు

వర్ధన్నపేట : విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) మధుసూదన్ రావు తెలిపారు. అప్రమత్తంగా ఉండడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారించొచ్చని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మి గార్డెన్స్‌లో మైలారం, రాయపర్తి, వర్ధన్నపేట సెక్షన్ల పరిధిలోని విద్యుత్ సిబ్బందికి శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ లైన్లపై పని చేసేటప్పుడు తప్పనిసరిగా భద్రత పరికరాలను వినియోగించాలని, లైన్‌పై పని చేసే ముందు ఎల్సీలు తీసుకోవాలని, ఎర్త్ డిశ్చార్జ్ రాడ్‌ను ఉపయోగించుకోవాలని, వోల్టేజ్ అలర్ట్ డిటెక్టర్‌ను వెంట ఉంచుకోవాలని సూచించారు. పంట పొలాల్లో విద్యుత్ తీగలు ఉంటే వాటిని ముట్టుకోకుండా విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని రైతులకు చెప్పారు. విద్యుత్ లైన్ల కింద పందిర్లు, జెండా గద్దెలు ఉండకుండా చూసుకోవాలని, గృహ వినియోగదారులు నాణ్యమైన సర్వీస్ తీగలను వినియోగించాలని, రైతులు టెస్టర్‌తో పరిశీలించాకే విద్యుత్ మోటార్లు ఆన్ చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు వేయడం లాంటి పనులు చేయొద్దని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎస్ఈ మధుసూదన్‌రావు

తొలుత విద్యుత్ నివారణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఈ (టెక్నికల్) పి.ఆనందం, డీఈ భిక్షపతి, వర్ధన్నపేట ఏడీఈ రాజు, ఏఈలు తరుణ్, నిఖిల్, సబ్ ఇంజనీర్లు దయాకర్, ముజఫర్, సురేశ్, కీర్తన పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుతోనే దేశ పటిష్టత

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిచి కేంద్రంలో అధికారం చేపడితే దేశం మరింత పటిష్టమవుతుందని బీజేవైఎం రాష్ట్ర ఇన్‌చార్జ్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి కోమలి నాయక్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థిగా వరంగల్ స్థానానికి బరిలో నిలిచిన అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణ పరిధిలోని డీసీ తండాలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ప్రియాంక, కోమలి నాయక్ పాల్గొని మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో పటిష్టంగా ఉండాలంటే బీజేపీని మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలో సుస్థిర స్థానానికి చేరుకుందని, దాన్ని కాపాడుకుని దేశ భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా కేంద్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్దూరి రాజు, కొండేటి సత్యం, మల్లెపాక అనిల్, రాయిని నరేందర్, ఎలుమకంటి గిరిప్రసాద్, కొండేటి బాబు, తేజ నాయక్, యాకూబ్, దేవేందర్ నాయక్, వినోద్ నాయక్, రమేశ్ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డీసీ తండాలో మాట్లాడుతున్న ప్రియాంక, కోమలి

కడియం కావ్యకు మద్దతుగా ప్రచారం



రాయపర్తి : ప్రచారం చేస్తున్న హామ్యానాయక్



సంగెం : ప్రచారం చేస్తున్న స్వామి, నాయకులు

రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న కడియం కావ్యకు మద్దతుగా మండలంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హామ్యానాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమానికి బాటలు పడతాయని చెప్పారు. కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ కుంట రమేశ్, నాయకులు కాంచనపల్లి వనజారాణి, ఉస్మాన్, పాల్వంచ కోటేశ్వర్, మచ్చ నీలయ్య, అఫ్రోజ్, ఫెరోజ్, కుంట రాజు, ఐత మారయ్య, ప్రవీణ్, ఉబ్బని నవీన్ పాల్గొన్నారు.

గీసుకొండ : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని కొమ్మాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి ఓటు అభ్యర్థించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగారపు స్వామి , నాయకులు సాయిలి ప్రభాకర్, మోహన్‌రెడ్డి, జక్కు సరిత, బట్టమేకల రాజయ్య, అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పర్వతగిరి గ్రామ కమిటీ అధ్యక్షుడు రాంచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, నాయకులు సునీల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని పల్లారుగూడలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులోతు స్వామి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కడియం కావ్యకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోతు వీరమ్మ, నాయకులు గుర్రం రాజిరెడ్డి, కక్కెర్ల మల్లేశం, రఫీక్ పాషా, చందూలాల్, రాజ్‌భరత్, గుర్రం ధర్మారెడ్డి, పోశాల రజనీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాశిక్షణతో నైపుణ్యం పెంపు



నర్సంపేట : క్రీడల్లో శిక్షణ ద్వారా నైపుణ్యం పెరుగుతుందని టార్గెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియంలో కబడ్డీ, రెజ్లింగ్ అంశాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాలను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. క్రీడాకారులు శిక్షణను వినియోగించుకుని పోటీల్లో రాణించాలని సూచించారు. ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భిక్షపతి, సారంగపాణి, స్వామి, రామదాసు, దేవీలాల్, రవికుమార్, మహేశ్, శేఖర్, రాజేశ్, కార్తీక్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి



ఖానాపురం : అర్హులందరూ ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ప్రతినిధులు బెజ్జంకి ప్రభాకర్, గిరగాని సుదర్శన్ కోరారు. మండలంలోని రాగంపేట, కొత్తూరు గ్రామాల శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను శనివారం వారు కలిసి మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు బాటలు వేయాలని కోరారు. ప్రజాసంక్షేమానికి పాటుపడతారన్న నమ్మకం ఉన్న అభ్యర్థులకు ఓటేయాలని సూచించారు. ఓటు వేయడాన్ని విస్మరించొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు సారంగం, వసంత, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణే పోలీసుల ధ్యేయం



కవాతు చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, పోలీసులు

దుగ్గొండి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ మరింత ప్రణాళికాయుతంగా పని చేస్తోందని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని బ్రిడ్జి నుంచి పెట్రోల్ బంక్ వరకు పోలీసులు బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ప్రజల్లో ధైర్యం కల్పించేలా కవాతు నిర్వహించనట్టు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్, రమణమూర్తి, చంద్రమోహన్, ఏఎస్సైలు పరమేశ్, రామారావు, అరుణ్‌కుమార్, ప్రవీణ్, రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించండి



రాయపర్తి : మాట్లాడుతున్న దయాకర్‌రావు



పర్వతగిరి : మాట్లాడుతున్న రాములు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మండలంలోని రాయపర్తి, మైలారం, తిర్మలాయపల్లి, గన్నారం, రాగన్నగూడెంల్లో శనివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. సమావేశాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అహంకారంపై దెబ్బకొట్టాలి

పర్వతగిరి : పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి కాంగ్రెస్ పార్టీ అహంకారంపై దెబ్బకొట్టాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు కోరారు. మండలంలోని సోమారం, జమలాపురం, గోరుగుట్టతండా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్, బీజేపీల మోసాలతోపాటు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశాల్లో నాయకులు ఏడుదొడ్ల జితేందర్‌రెడ్డి, యుగంధర్‌రావు, చిన్నపాక శ్రీనివాస్, ఎర్పుల శ్రీనివాస్, కరిమిళ్ల దుర్గారావు, బానోతు వెంకన్న, పిడుగు రేణుక సాయిలు, చిన్నం లక్ష్మీనారాయణ, కొల్లూరి రవి, తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌కే ఎస్సీ, ఎస్టీల మద్దతు’



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

పర్వతగిరి : ఎస్సీ, ఎస్టీలు కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతిస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మండలానికి చెందిన ఎస్సీ, ఎస్టీలు పార్టీ తరపున బరిలో నిలిచిన కడియం కావ్యకు ఓటేయాలని కోరారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మాట్లాడుతూ సంఘం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతు ప్రకటించిందని తెలిపారు. దళిత కాంగ్రెస్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని సవరిస్తామన్న నేపథ్యంలో మతతత్వ బీజేపీకి ఓటు వేయొద్దని ప్రజలను కోరారు. సమావేశంలో ఎస్టీ సెల్ మండల కన్వీనర్ భారత్ భాస్కర్, నాయకులు కందికట్ల సైకిలాబ్‌బాబు, బొట్ల కనకరాజు, వెంకట్రాం, మంద రవీందర్, మునిగె కుమారస్వామి, కాసర్ల రాములు, జిల్లా కుమారస్వామి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన సిద్దోజు బ్రహ్మాచారి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.3 వేల సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, ఎంబాడి రాజమౌళి, కూనమల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత పార్టీలకు బుద్ధి చెప్పాలి

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : ప్రజలను అబద్ధాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దకొర్పోలు, గుండ్రపల్లి, చంద్రుగొండ, పనికర, సూరిపల్లి, తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలు వంచిస్తున్నాయని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను విస్మరించాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని చెప్పారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. పార్టీ తరఫున మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవితను అత్యధిక మెజార్టీతో గెలించాలని కోరారు. సమావేశాల్లో పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, ఎంపీపీ జాటోతు రమేశ్ నాయక్, జెడ్పీటీసీ లావుడ్య సరోజ, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

సాంకేతిక రంగంలో మెళకువలతోనే ఉన్నతి

నర్సంపేట రూరల్ : విద్యార్థులు సాంకేతిక రంగంలో మెళకువలు నేర్చుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని ట్రెజర్ ఆఫ్ యంగ్ ప్రొఫెషనల్ ఎఫినిటి గ్రూప్ ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ వైస్ చైర్మన్ మహేశ్ నీరటి తెలిపారు. మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ‘నావిగేటింగ్ లైఫ్ ఆఫ్టర్ బీటెక్’పై శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు మహేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత సమాజంలో నెలకొన్న పోటీని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. చదువులకే పరిమితం కాకుండా నూతన సాంకేతికతను కళాశాల స్థాయిలోనే నేర్చుకోవాలని చెప్పారు. మెళకువలు పాటిస్తూ సాంకేతిక రంగాల్లో రాణించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో గ్రూప్ ప్రొఫెషనల్ ఒమర్ ఫరూఖ్, ప్రిన్సిపాల్ హరిహరన్, ఏఓ సురేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

పరామర్శ



ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన మర్రి విజయ్ ఇటీవల వడదెబ్బకు గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకోగా ఆయన్ను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు శనివారం పరామర్శించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండ తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేసుకోవాలని, అత్యవసరమైతే సరైన జాగ్రత్తలు పాటిస్తూ బయటకు వెళ్లాలని చెప్పారు. ఎంపీపీ వెంట మాజీ సర్పంచ్ సుమన్, మాజీ ఉపసర్పంచ్ మేడిద కుమార్, బాలు తదితరులున్నారు.

లింగయ్య గెలుపునకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

నర్సంపేట : ఆదివాసీ ఐక్య సంఘాల అభ్యర్థిగా మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన చందా లింగయ్యను గెలిపించేందుకు కృషి చేయాలని ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కుసుంబ బాబురావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. లింగయ్యకు పార్టీ, బీఎల్ఎఫ్ మద్దతిస్తున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆశయాల మేరకు ఎంసీపీఐ(యూ) ఆదివాసులకు మద్దతుగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వట్టం ఉపేందర్, దామ సాంబయ్య, జన్ను రమేశ్, పాడుగు శ్రీనాథ్, రమణాల లక్ష్మయ్య, ముక్తి రాజు, నర్సింహారావు పాల్గొన్నారు.

19న సామూహిక షష్టిపూర్తి మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటాచార్యులు, తదితరులు

నర్సంపేట : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలోని నక్షత్ర వన వృక్షశ్రీ నిలయ క్షేత్రంలో ఈనెల 19న ఉదయం 9 గంటలకు ధరణిశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్, ఉభయ వేదాంత పండితుడు ముడుంబై వెంకటాచార్యులు తెలిపారు. ఆ కార్యక్రమ కరపత్రాలను పట్టణంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటాచార్యులు మాట్లాడారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వివాహం, ఆరోగ్యం, కుటుంబంలో కలతలు, ఆర్థిక, నవగ్రహ దోష, నరఘోష ఇత్యాది సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు దోషాల నివృత్తి కోసం యాగంలో పాల్గొని క్రోధి నామ సంవత్సరంలో రానున్న విపత్తులను నివారించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలనే కాంక్షతో యాగం చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొనడానికి వీలు కాని ప్రజలు పేర్లు, నక్షత్రం, తదితర వివరాలు పంపిస్తే గ్రహశాంతి చేస్తారని చెప్పారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 98853 63710లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆధ్యాత్మిక సభ్యులు రమణాచార్యులు, రంగనాథ్, శ్రీకర్, రూపావతి పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

గూడూరు: మండలంలోని బొద్దుగొండకు చెందిన కొట్టి జెస్సికి గతేడాది ఎంపీ హోదాలో మాలోతు కవిత కేంద్రీయ విద్యాలయంలో సీటు ఇప్పించగా శనివారం బొద్దుగొండలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా కవితను జెస్సి కుటుంబం సన్మానించింది.

2 కిలోల గంజాయి స్వాధీనం

ఖిలా వరంగల్ : రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు మహిమూద్, గోవర్దన్, మున్నీరుల్లాతో కలిసి ఇన్‌స్పెక్టర్ వివరాలను శనివారం వెల్లడించారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గరు వ్యక్తుల్లో వరంగల్ శివనగర్ సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన కలకోట్ల చరణ్ పట్టుపడగా, ఆదిత్య, అనిల్ పరారయ్యారని తెలిపారు. చరణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కీలకం

దుగ్గొండి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి, ఇతర మౌలిక వసతులు కల్పించడం కీలకమని ఎంపీడీఓ అరుంధతి తెలిపారు. ఎన్నికల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీటి, ర్యాంపుల ఏర్పాటు, తదితరాలపై సమీక్షించారు. ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. అవసరమైన సదుపాయాల కల్పనలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అరుంధతి

అధిక దిగుబడికి మెళకువలు పాటించాలి

దామెర : ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడి పొందేందుకు రైతులు మెళకువలు పాటించాలని పరకాల డివిజన్ ఉద్యానవన శాఖాధికారి మధులిక అన్నారు. మండలంలోని ఆయిల్‌పామ్ పంటలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేసవి తాపం నుంచి మొక్కలు తట్టుకునేందుకు మొక్కల పాదులకు కొద్దిదూరంలో జనుము విత్తనాలు చల్లాలని అన్నారు. నీటి ఎద్దడి ఉన్న తోటల్లో అంతర పంటల సేద్యం చేయకూడదని సూచించారు. అదే విధంగా పాదులను నిండుగా నీటితో తడపకుండా తేమ ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. మూడేళ్ల మొక్కలోని పూగుత్తులను లేత దశలోనే ప్రతీనెలా అబ్లేషన్ సాధనంతో తొలగించాలని అన్నారు. ఎదిగిన ఆయిల్‌పామ్ గెలలు కోసిన తరువాత వాటిని నరికి ముక్కలు చేసి ఆయిల్ పామ్ ఆకులను, మగపూల గుత్తులను, మొక్కజొన్న చొప్పను, ఖాళీ ఆయిల్ పామ్ గెలలను మల్చింగ్ చేయాలని సూచించారు. మొక్కల ఆకులను నరకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.